క్లుప్తంగా

7న స్కంద షష్ఠి

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వతేదీన స్కంద షష్ఠి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎస్ఐగా కె. నరసింహుడు బాధ్యతల స్వీకరణ



ములకలచెరువు: ములకలచెరువు ఎస్ఐగా కే నరసింహుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ గాయత్రి మదనపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన నరసింహుడు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తాం

– ఈఈ విజయభాస్కర్



గోపాలపురంలో రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కలకడ : ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు ఆపేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం మండలంలోని కె.దొడ్డిపల్లెలో 100 మీటర్లు, గోపాలపురంలో 50 మీటర్లు, కలకడలో 100 మీటర్ల మేర ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్లును పరిశీలించి క్వాలిటీ తనిఖీ చేశారు. నిధులకు కొదవలేదని సిమెంట్‌రోడ్లు మంజూరు చేసిన గ్రామాలలో వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ అధికారి ఉమామహేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ రూప్‌సాగర్, ఈసీ సమీఉల్లా, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వై.వి. రమణరావు

పీలేరు రూరల్ : రైతులు పంట బీమా సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఏడీఏ వై.వి. రమణ అన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ కురవపల్లె, వేపులబైలు పంచాయతీ బండమీదపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసినరైతులు వేరుశనగకు ఎకరాకు రూ. 96, వరికి రూ. 126, టమాటకు రూ. 1600 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని కోరారు. అలాగే పంటలు సాగు చేసిన రైతులు విధిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్నవారికే ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు, సహాయం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమాదేవి, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు ఇంద్రసేనారెడ్డి, మధులత పాల్గొన్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం): మండలంలోని కూరపర్తికి చెందిన సాంబశివారెడ్డి కుమారుడు సదాశివరెడ్డి(53) రోడ్డు ప్రమాదంలో బుధవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని సదాశివరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

20 నెలల్లో ముగ్గురు ఎస్ఐల బదిలీ

పెద్దతిప్పసముద్రం: సాధారణంగా పోలీసులు బదిలీలపై వారికి కేటాయించిన ప్రదేశానికి పోస్టింగ్ వస్తే కనీసం రెండేళ్లయినా విధులు నిర్వర్తిస్తారు. అయితే పెద్దతిప్పసముద్రం మండలంలో మాత్రం కేవలం 20 నెలల వ్యవధిలోనే ముగ్గురు ఎస్ఐలు బదిలీలు కావడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ఎస్ఐ రవీంద్రబాబు 2023 ఏప్రిల్ 30న ఇక్కడ బాధ్యతలు చేపట్టి 13 నెలల వ్యవధిలోనే బదిలీపై లక్కిరెడ్డిపల్లి మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో ఈ ఏడాది ఆగస్టు 11న ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహుడు కేవలం నాలుగు నెలలు కూడా కాకుండానే ములకలచెరువుకు బదిలీ అయ్యారు.

వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటలు

- తెగుళ్లతో తగ్గిన పంట దిగుబడి
- వందకు 30- 35 క్రేట్లు దెబ్బతిన్న టమాటాలే
- 25 కేజీల టమాటా క్రేట్ ధర రూ.1300
- తెగుళ్లు బారినపడిన టమాటా క్రేట్ రూ.200



తలారివాండ్లపల్లె వద్ద దెబ్బతిన్న టమాటా తోట

గుర్రంకొండ: ఫెంగల్ తుపాన్ ఎఫెక్ట్‌తో టమాటా తోటలు దెబ్బతిన్నాయి. వరుస తుపాన్లతో పంటలకు నల్లమచ్చలు, ఊజి తెగుళ్లు సోకి దిగుబడి తగ్గిపోయింది. టమాటా ధరలు ఘనంగా ఉన్నా తెగుళ్లతో తోటలు భారీగా దెబ్బతిన్నాయి. వంద క్రేట్ల టమటా కోతల్లో సుమారు 30 నుంచి 35 క్రేట్ల వరకు దెబ్బతిన్న కాయలే ఉంటున్నాయి. మార్కెట్లో ప్రస్తుతం 25 కేజీల టమాటా క్రేట్ ధర రూ. 1300 పలుకుతుండగా తెగుళ్ల బారిన పడిన టమాటాలు కేవలం రూ.200 లోపు మాత్రమే ధర పలుకుతున్నాయి.

తెగుళ్లతో దెబ్బతిన్న తోటలు

ప్రస్తుత తుపాన్ దెబ్బకు టమాటా తోటలకు నల్లమచ్చలు, ఊజి, గజ్జి తెగుళ్ల ఆవహించడంతో భారీగా తోటలు దెబ్బతిన్నాయి. తుపాన్ వర్షాలు మరియు వాతావరణ మార్పులు కారణంగా రోగాలు భారీగా టమాటా తోటలను ఆవహించాయి. చెట్టులోని కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. నల్లమచ్చలున్న కాయల అలాగే సైజు పెరిగినా మచ్చలు అలాగే ఉంటున్నాయి. దీంతో వీటికి మార్కెట్లో డిమాండ్ లేకపోతోంది.

6250 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ఫెంగల్ తుపాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా 6250 ఎకరాల్లో టమాటా పంటలు దెబ్బతిన్నాయి. మంచి కాపుమీదున్న టమాటా తోటలు ఐదురోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో తెగుళ్ల బారిన పంటల్లో కాయల భారీగా రూపురేఖలు మారిపోయాయి. వీటికి తోడు పలు చోట్ల కాయలు, పిందెలు రాలిపోయి కాలువల్లో పడిపోయాయి. దీంతో రైతులు అన్నివిధాలా నష్టపోతున్నారు.





తెగుళ్లతో నల్లమచ్చలు వచ్చిన టమాలు, రంధ్రాలు పడి పుచ్చులు పడిన కాయలు

తుపాన్‌తో పంటలు దెబ్బతిన్నాయి



తుపాన్ దెబ్బతో తెగుళ్ల సోకి టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. ఎకరం టమాటా పంటకు సుమారు 800 క్రేట్ల టమాటాలు దిగుబడి రాగా ఇందులో సగానికిపైగా అంటే 240 నుంచి 280 క్రేట్ల వరకు నల్లమచ్చలున్న టమాటాలు వస్తున్నాయి. చెట్టుకాండం నుంచి ఆకులు, కాయలతో సహా నల్లమచ్చలు ఏర్పడ్డాయి. - వెంకటరమణ, గంగిరెడ్డిపల్లె

మార్కెట్లో ధరలు లేవు



మార్కెట్లో నల్లమచ్చలు, తెగుళ్ల సోకిన టమాటాలకు ధరలు లేవు. నాణ్యమైన టమాటాలు ఒక క్రేట్ ధర రూ.1300 . నల్లమచ్చలున్న కాయలు ఒక క్రేట్ ధర రూ.200. దీంతో ఒక క్రేట్‌కు రూ.1100 వరకు రైతులు నష్టపోతున్నారు. తెగుళ్ల నివారణకు ఎకరానికి రూ.60 వేల వరకు మందులకు ఖర్చు చేయాల్సి వస్తోంది. -నాగరాజు, గుట్టకిందపల్లె

విద్యాశాఖ నిర్ణయాలు పునఃసమీక్షించాలి



ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున యూటీఎఫ్ నాయకులు



ఎంఈఓ రెడ్డిబాషాకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీలేరు : విద్యాశాఖ నిర్ణయాలు పునఃసమీక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదాశివారెడ్డి అన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలనే డిమాండ్‌తో స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేసి ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒత్తిడిలేని వాతావరణంలో విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడేలా ఉండాలన్నారు. ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు కల్గించేలా ఉన్న విద్యాశాఖ నిర్ణయాలు సమీక్షించకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు శివారెడ్డి, అక్రమ్‌బాషా, సుధాకర్, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్, కృష్ణమూర్తి, మునిరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలి

కేవీపల్లె : విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని జిల్లా కోశాధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేసి ఎంఈవో రెడ్డిబాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పని వేలలు పెంపు, 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు, పదవ తరగతి పరీక్షకు సంసిద్ధత పేరుతో వంద రోజుల ప్రణాళిక, విద్యార్థుల వివరాలు ఆపార్‌లో నమోదు ఇలా ప్రతి నిర్ణయం అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకుల అభిప్రాయాలు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోలేదన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒంటెత్తు పోకడలతో నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులకు అత్యవసర సమయంలో కూడా సెలవు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోయూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, అనిరుద్రయ్య, జిల్లా కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అన్నయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కుంటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



కుంటి గంగమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి

రామసముద్రం : మండలంలోని కాప్పల్లె హరిజనవాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కుంటి గంగమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, వేదపండితులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుంటి గంగమ్మకు తిప్పారెడ్డి పూజలు నిర్వహించగా, అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు దైవభక్తి పెరిగిందని, ప్రతి గ్రామంలోనూ ఆలయాల నిర్మాణానికి ప్రజలు కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. పూజా కార్యక్రమాల్లో నిమ్మనపల్లె రామారావు, దినకర్, రాజేష్, హైదర్‌వలి, ఈశ్వర్, బుద్దారెడ్డి, శంకర, అబ్బరాజు, చెంగప్ప, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి



పెద్దమండ్యం లే అవుట్‌లో పక్కాగృహాలను పరిశీలిస్తున్న ఈఈ, అధికారులు

పెద్దమండ్యం: జగనన్న లే అవుట్‌లలో పక్కాగృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాస్ అన్నారు. మండలంలోని వెలిగల్లు, తురకపల్లె, పెద్దమండ్యం, ఎస్‌వో పల్లె, పాపేపల్లె జగనన్న లేఅవుట్‌లను బుధవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా చేపట్టేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పెద్దమండ్యం లే అవుట్‌లో నిర్మించిన రిటర్నింగ్ వాల్‌ను పరిశీలించారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు రిటర్నింగ్ వాల్ నిర్మించామని, బిల్లులు రాలేదని సర్పంచ్ బాషా ఈఈ దృష్టికి తెచ్చారు. లే అవుట్‌లో ఉన్న వీధులలో యర్రమట్టిని వేయించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ రావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, ఏఈ అక్రమ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పడిపూజ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయ్యప్పనామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. శబరిమల మాలికపురం మేల్ తంత్రి మనోజ్‌స్వామి ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, రంగు రంగు విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలోని పద్దెనిమిది మెట్లను వివిధ రకాల పుష్పాలు, నేతి దీపాలు, చందన, కుంకుమ, ఫలాలతో సుందరంగా తీర్చిదిద్దారు. కేరళ సంప్రదాయ పద్ధతులతో ప్రతి మెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పడిమెట్ల పూజోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అయ్యప్పస్వామి భజనలు భక్తులను అలరించాయి. పడిమెట్ల పూజ అనంతరం అయ్యప్పస్వామికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు విజయలక్ష్మి భాస్కర, జర్మన్‌రాజు, భగవాన్, శివమూర్తి, మల్లేనాయక్, మహేష్,హేమంత్, బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ ప్రారంభం

కలికిరి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు జిల్లాలోని కలికిరి మండలంలో ఈ ఏడాది జూన్ నుంచి మండలంలో జరిగిన ఉపాధి పనుల పరిశీలన నిమిత్తం డ్వామా పీడీ మునిరత్నం ఐదుగురు సభ్యులతో కూడిన నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం కలికిరికి చేరుకున్న అధికారులు స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో మండలంలో జూన్ నుంచి జరిగిన పనుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాలుగు టీంల సభ్యులు బుధవారం వారికి కేటాయించిన గ్రామాల పరిధిలో జరిగిన పనులపై విచారణ చేపట్టారు. విచారణలో నిజానిజాలు వెలుగు చేసేనా అని మండలంలో చర్చనీయాంశంగా మారింది. కాగా విచారణపై వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించడానికి నిరాకరించారు. నివేదికను ఉన్నతాధికారులు పంపనున్నట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ నివారణకు కృషి చేయాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసులు, రామకృష్ణ

కలకడ : ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ నివారణకు జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించినట్లు కలకడ మండలం కోన గ్రామానికి చెందిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణలు తెలిపారు. బుధవారం వారు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కమిటీలో స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి మండల, గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు తీవ్రఅన్యాయం జరిగినప్పుడు వెంటనే జిల్లా మానిటరింగ్ కమిటీ స్పందిస్తుందని తెలిపారు.

అంగళ్లులో తీరిన ఓల్టేజీ సమస్య

కురబలకోట: నియోజక వర్గంలోనే కీలకంగా ప్రముఖ విద్యా, వ్యాపార, వాణిజ్య కూడలిగా ఉన్న అంగళ్లును పట్టి పీడిస్తున్న లోఓల్టేజి సమస్య ఎట్టకేలకు దూరమైంది. స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తగా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. అంగళ్లు ఓపీ స్టేషన్, సంత వీధి, చేనేత నగర్‌లో వీటిని ఏర్పాటు చేసినట్లు ఏఈ పి. శంకర్‌రెడ్డి, లైన్ ఇన్స్‌పెక్టర్ దాదం రామలింగారెడ్డి బుధవారం తెలిపారు. ఇకపై అంగళ్లుకు లో ఓల్టేజి సమస్య ఉండదని తెలిపారు. దీంతో గ్రామస్థులు, వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోం చేసుకోండి

నిమ్మనపల్లె : గ్రామస్థాయిలో భూసమస్యల పరిష్కారానికి ఈనెల 6 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ధనంజయులు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో 22ఏ, ఫ్రీహోల్డ్, భూఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్ పోర్టల్ ద్వారా స్వీకరించనున్నట్లు చెప్పారు. మండలంలో సదస్సుల షెడ్యూల్ వివరాలను తెలిపారు. ఈనెల 6న వెంగంవారిపల్లె, 10న బండ్లపై, 12న ముష్టూరు, 13 కొండయ్యగారిపల్లె, 18 రెడ్డివారిపల్లె, 19 మాచిరెడ్డిపల్లె, 20 రాచవేటివారిపల్లె, 24 తవళం, 26 చౌకిళ్లవారిపల్లె, 27 నిమ్మనపల్లె, జనవరి 2న అగ్రహారం, 3న సామకోటవారిపల్లె గ్రామసచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రైతులకు సౌకర్యాలు మెరుగుపరచాలి

– మార్కెటింగ్ ఏడీఎం త్యాగరాజు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఎం త్యాగరాజు

మదనపల్లె : టమాటా మార్కెట్ యార్డులో వచ్చే మార్చి నాటికి రైతులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు ఆదేశించారు. బుధవారం టమాటా మార్కెట్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లో ఇప్పటివరకు ఉన్న ట్రేడర్ లైసెన్స్‌లు రెన్యువల్ వేగవంతం చేయాలన్నారు. మండీ యజమానుల నుంచి రావాల్సిన అద్దె బకాయిలను ఎప్పటికప్పుడు వసూలుచేయాలన్నారు. ప్రస్తుతం అన్‌సీజన్ నడుస్తున్నందున మార్కెట్‌లో రైతు విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, ఇతర భవనాలకు మరమ్మతులు పూర్తిచేయించాలన్నారు. ప్రతిరోజు పారిశుధ్యపనులను పర్యవేక్షించాలన్నారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ మాట్లాడుతూ ఇప్పటివరకు అద్దెబకాయిలు రూ.30 లక్షలు వసూలు చేశామని, మిగిలిన మొత్తాలను త్వరలోనే కట్టిస్తామన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ లావాదేవీలకు సంబంధించి రికార్డుల నిర్వహణ సక్రమంగా జరపాలని ఏడీఎం త్యాగరాజు, సిబ్బందికి సూచించారు. మదనపల్లె రైతుబజార్‌లో వర్షపునీరు నిల్వ ఉండకుండా, మట్టితోలి చదును పనులు చేయిస్తున్నామన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

– పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీడీ సత్యనారాయణ

నిమ్మనపల్లె : గొర్రెలు, మేకలను వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించాలని మదనపల్లె పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ కే.సత్యనారాయణ అన్నారు. బుధవారం నిమ్మనపల్లె మండలంలోని రాచవేటివారిపల్లె గొల్లపల్లిలో పిపిఆర్ వ్యాక్సినేషన్, ఎర్రాతివారి పల్లెలో పశు గణన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న కార్యక్రమాల ప్రగతి పై మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలలో వైరస్ వ్యాప్తి కారణంగా పారుడు వ్యాధి బారిన పడి మృతి చెందే అవకాశం ఉందన్నారు. వ్యాధిని నివారించడానికి వ్యాక్సినేషన్ ఒక్కటే మార్గమన్నారు. పెంపకందారులు జీవాలకు వ్యాక్సినేషన్ చేయించి కాపాడుకోవాలని సూచించారు. పాడి రైతులు పశువుల వివరాలను అందించి పశు గణనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, జేవీఓ ప్రతాప్,ఎల్ ఎస్ ఏ మునేంద్ర, పశు వైద్య సహాయకులు భూదేవి, శ్రీలత, పాడి రైతులు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

– డీఎస్పీ కొండయ్యనాయుడు



మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు సంబంధించి మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్‌లో ఎలాంటి గొడవలు జరగకుండా రెండు వర్గాలు సంయమనం పాటించాలని డీఎస్పీ కొండయ్యనాయుడు అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో హిందూసంఘాల నేతలు, ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ...మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు. ఎవరైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. పోలీస్‌నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. సమావేశంలో హిందూ, ముస్లిం సంఘాల నేతలు పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె సిటీ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మదనపల్లె పట్టణంలో బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంగళూరు బస్టాండు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎదుట ధర్నా చేశారు. ఏఓను వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక నాయకులు బండి ఆనంద్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం కలగజేసుకుని విదేశాంగమంత్రి ద్వారా దాడులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దాడులను ప్రపంచ దేశాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు నారదరెడ్డి, బర్నేపల్లి రవికుమార్, మహేష్, సురేష్, రామమోహన్‌రెడ్డి,వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాల అశ్వ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ



అశ్వ ఫెస్టివల్ పోస్టర్ల ఆవిష్కరణ

కురబలకోట: మదనపల్లె దగ్గరున్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా జాతీయ స్థాయిలో నిర్వహించే అశ్వ ఫెస్టివల్-25కు సంబంధించి పోస్టర్, ప్రోమోను బుధవారం ఆవిష్కరించారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో ఆవిష్కరణ నిర్వహించారు. ఫిబ్రవరి 21, 22న రెండు రోజుల పాటు సినీ తారలచే ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులకు టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈపోటీలలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కళాశాల అశ్వ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ద్వారకనాథ్, కమాల్ బాషా, ప్రదీప్‌కుమార్, జగన్ మోహన్ రెడ్డి, సుశాంత్, పవన్,వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షితతో పాటు పీఆర్వో మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

గుర్రంకొండ: మండలంలో ఈనెల 6 తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 6న టి.పసలవాండ్లపల్లెలో, 10తేదీన ఎల్లుట్లలో, 12 తేదీన చెర్లోపల్లెలో, 14తేదీన నడిమికండ్రిగలో, 17తేదీన గుర్రంకొండలో, 19న తరిగొండలో, 21న గుర్రంకొండ-1లో, 24న సరిమడుగులో సదస్సులు నిర్వహిస్తామన్నారు. అలాగే 26న అమిలేపల్లెలో, 28న సంగసముద్రంలో సదస్సులు జరుగుతాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 02 తేదీన శెట్టివారిపల్లెలో, 3న రామాపురం, 7న ఖండ్రిగ, 8న మర్రిపాడులో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తంబళ్లపల్లె మండలంలో..

తంబళ్లపల్లె: మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 7వతేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. 6వ తేదీ ఎద్దులవారిపల్లె, 7న కొటాల, 10న గోపిదిన్నె, 11న దిగువపాళెం, 12న గుండ్లపల్లె, 13న కోసువారిపల్లె, 17న బాలిరెడ్డిగారిపల్లె, 18న తంబళ్లపల్లె, 19న తంబళ్లపల్లె-2, 20న ఎర్రసానిపల్లి, 24న పంచాలమర్రి, 26న గంగిరెడ్డిపల్లె, 27న కొట్లపల్లి, 28న రేణుమాకులపల్లె, 31న కన్నెమడుగులో సదస్సులు నిర్వహిస్తామన్నారు. జనవరి 2న మర్రిమాకులపల్లె, 3న కోటకొండ, 4న కుక్కరాజుపల్లి,7న జంజురపెంటలో సదస్సులు జరుగుతాయన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అధికారులకు తెలియజేసి పరిష్కారించుకోవాలని కోరారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం అమళ్ళబండకోట, శనివారం కంసలవాండ్లపల్లి, 10న వతేదీ మల్లెల, 11న టి.సదుంలో 12న తుమ్మరకుంట, 13న తుమ్మరకుంట, చిన్నపొంగుపల్లి, 17న బూర్లపల్లి, 18న బూచిపల్లి, 19న పట్టెంవాండ్లపల్లి వన్, 20న పట్టెంవాండ్లపల్లి టూ, 24న కందుకూరు, 26న రంగసముద్రం వన్, 27న రంగసముద్రం టూ, 31న కాట్నగల్లులో నిర్వహిస్తామన్నారు. అలాగే జనవరి 2న మద్దయ్యగారిపల్లి, జనవరి 3న సంపతికోట, 4న పులికల్లు, 7న మడుమూరు, 8న పెద్దతిప్పసముద్రంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

బి.కొత్తకోట మండలంలో..

బి.కొత్తకోట: ఈనెల 6 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ అహ్మద్ అన్సారీ బుధవారం తెలిపారు. 6న బీరంగిలో, 11న బడికాయలపల్లె, 19, 20న గట్టు, 26, 27న బి.కొత్తకోట, 30న గుమ్మసముద్రం, జనవరి 3న కోటావూరు, 6న గోళ్లపల్లె, 8న తుమ్మనగుట్టలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6న కొత్తవారిపల్లెలో ..

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లెలో ఈనెల 6న రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, షెడ్యూల్‌లో భాగంగా కొత్తవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూసమస్యలు ఉన్న ప్రజలు, సదస్సుకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చాన్నారు.